భూభారతి రైతులకు వరం

• కలెక్టర్ విజయేందిర బోయి, ఎమ్మెల్యే జీఎమ్మార్

మూసాపేటలో అవగాహన సదస్సులో పాల్గొన్న కలెక్టర్, ఎమ్మెల్యే జీఎమ్మార్

మూసాపేట(అడ్డాకుల), ఏప్రిల్ 21: భూ భారతి చట్టం రైతులకు వరంలాంటిదని, భూ భారతితో భూ సమస్యల పరిష్కారం మరింత సులభమవుతుందని కలెక్టర్ విజయేందిర బోయి, ఎమ్మెల్యే మధూసూదన్‌రెడ్డి సూచించారు. సోమవారం అడ్డాకులలోని సంతబజార్, మూసాపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అవరణలో భూ భారతి, ఆర్ వోఆర్ చట్టంపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కలెక్టర్, ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన భూ భారతి చట్టంపై 17వ తేదీ నుంచి 29వ తేదీ వరకు అన్ని మండలాల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.సమావేశంలో అదనపు కలెక్టర్ మోహన్‌రావు, డీఆర్డీవో నవీన్, నియోజకవర్గ ప్రత్యేక అధికారి శంకరాచారి, తాసీల్దార్ శేఖర్, రాజు, ఎంపీడీవోలు శ్రీనివాసులు, కృష్ణయ్య, నాయకులు నాగిరెడ్డి, శ్రీహరి, శెట్టి శేఖర్, బగ్గి కృష్ణయ్య, బాలనర్సింహులు, కొండా జగదీశ్వర్, విజయ మోహన్‌రెడ్డి, ఆయా గ్రామాల నాయకులు, కార్యకర్తలు, రైతులు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తడిసిన ధాన్యం కూడా కొంటాం

మూసాపేట(అడ్డాకుల), ఏప్రిల్ 21: తడిన ధాన్యం కూడా కొంటామని, రైతులు ఎవరూ ఆవేదన చెందాల్సిన పనిలేదని కలెక్టర్ విజయేందిరబోయి, ఎమ్మెల్యే జీఎమ్మార్ పేర్కొన్నారు. అడ్డాకుల పీఏసీసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని సోమవారం వారు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తడిసిన ధాన్యాన్ని పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఇటీవల అకాల వర్షాలతో తడిసిన ధాన్యం గింజను కొంటామని చెప్పారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ జితేందర్ రెడ్డి, శ్రీహరి, రాములు, బుచ్చన్న గౌడ్, వేగనాథ్ తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో విధులు నిర్వర్తించాలి

• పాలమూరు ఎస్పీ జానకి

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 21: హోమ్‌గార్డ్స్ క్రమ శిక్షణతోపాటు బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించి ప్రజల మన్ననలు పొందాలని ఎస్పీ జానకి సూచించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలోని పరేడ్ మైదానంలో నాగర్‌కర్నూల్, వనపర్తి, జోగులాంబ గద్వాల, నారాయణపేట జిల్లాల నుంచి రొటేషన్ పద్ధతిలో మహబూబ్‌నగర్ జిల్లాకు కేటాయించబడిన 110మంది హోమ్‌గార్డ్స్ అధికారులతో ఎస్పీ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడారు. జిల్లాలో విధులు నిర్వహించేందుకు వచ్చిన హోమ్‌గార్డుల సంక్షేమం కోసం జిల్లా పోలీసులు ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారని పేర్కొన్నారు. హోమ్‌గార్డ్సును ఎంటీ సెక్షన్, జనరల్ డ్యూటీ, బ్లూ కోల్ట్స్, ట్రాఫిక్, తపాల్ వంటి విభాగాల్లో నియమించినున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ సురేశ్‌కుమార్, డీఎస్పీ శ్రీనివాసులు, ఆర్ఐలు కృష్ణయ్య, నాగేశ్, రవి, ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మత్తు పదార్థాలపై సమాచారమివ్వాలి

• *డీఎస్పీ లింగయ్య*

కోస్గి, ఏప్రిల్ 21: గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలు వినియోగిస్తున్న, రవాణా చేసిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని డీఎస్పీ లింగయ్య పేర్కొన్నారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో నార్కోటిక్స్ స్నైపర్ పోలీస్ జాగిలాలతో సోమవారం ఆకస్మిక తనిఖీలు చేశారు. గంజాయి, మత్తు పదార్థాల నిర్మూలన, అక్రమ రవాణా జరగకుండా తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. పట్టణంలోని పలు కిరాణా షాపులు, అనుమానంగా ఉన్న పంట పొలాలు, పాన్‌షాపుల్లో తనిఖీలు చేసినట్లు తెలిపారు. ఈ తనిఖీలో ఏఎస్సై ఆంజనేయులు, నార్కోటిక్స్ స్నైపర్ డాగ్, విక్కీ డాగ్ హ్యాండ్లర్ పరమేశ్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సెమినార్‌లో జిల్లావాసి ఉత్తీర్ణత

సర్టిఫికెట్‌ను అందుకుంటున్న తాజొద్దీన్

జడ్చర్ల టౌన్, ఏప్రిల్ 21: ఊషూ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఊషూ జడ్జింగ్ సెమినార్‌లో జడ్చర్లకు చెందిన కరాటే మాస్టర్ తాజొద్దీన్ ఉత్తీర్ణత సాధించాడు. మార్షల్‌ఆర్ట్స్, ఇతరాత్ర స్పోర్ట్స్ విభాగాల పోటీల్లో జడ్జింగ్ నిర్వహించేందుకు చేపట్టిన అర్హత సెమినార్‌లో జిల్లా నుంచి తాను ఒక్కరే ఉత్తీర్ణత సాధించి జడ్జింగ్ సర్టిఫికెట్‌ను అందుకున్నట్లు తాజొద్దీన్ తెలిపారు. ఈ సందర్భంగా అమేచూర్ ఊషూ రాష్ట్ర అధ్యక్షుడు ప్రేమ్‌రాజ్ చేతుల మీదుగా ఉత్తీర్ణత సర్టిఫికెట్‌ను అందుకున్నట్లు తెలిపారు. జడ్చర్లకు చెందిన సీనియర్ కరాటే మాస్టర్ తాజొద్దీన్ సెమినార్‌లో ఉత్తీర్ణత సాధించడంపై జడ్చర్ల కరాటే మాస్టర్లు, విద్యార్థులు అభినందనలు తెలిపారు.

మత్స్యకారుల అభ్యున్నతికి చర్యలు చేపట్టాలి

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, ఏప్రిల్ 21: జిల్లాలోని మత్స్యకారుల అభ్యున్నతికి చెరువుల మరమ్మతు, కుంటల రక్షణకు చర్యలు చేపట్టాలని ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షుడు మెట్టుకాడి ప్రభాకర్ కోరారు. సోమవారం అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న ఎఫ్‌సీఎస్ సంఘాల రిజిస్ట్రేషన్, డీఎఫ్‌సీఎస్, ఎఫ్‌సీఏసీలకు నిర్ణీత కాలంలో ఎన్నికలు నిర్వహించాలని కోరారు. చెరువులు, కుంటల్లో ఉన్న జంగల్ కటింగ్ పనులు పూర్తి చేయాలన్నారు. వర్షాకాలంలో ఎక్కువ నీరు నిలువ ఉండేలా చూడాలన్నారు. విభజన వల్ల ఏర్పడిన జీపీల పరిధిలోని కుంటలు ఆయా గ్రామాల పరిధిలోనే పొందుపర్చాలన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, గంగాధర్, నర్సింహులు, కృష్ణ పాల్గొన్నారు.

ఇసుక నిల్వలు సీజ్

కృష్ణ, ఏప్రిల్ 21 : అక్రమంగా డంపు చేసిన ఇసుకను సీజ్ చేసినట్లు తాసీల్దార్ వెంకటేశ్ సోమవారం ప్రకటనలో తెలిపారు. మండలంలోని ముడుమాల గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు గ్రామ శివారులో నిత్యం రాత్రి కృష్ణానది నుంచి హిటాచి ద్వారా టిప్పర్లకు, ట్రాక్టర్లకు ఇసుకను నింపి ఓ పొలంలో డంపు చేస్తున్నారని, ఈ ఇసుకను టిప్పర్‌కు రూ.30 నుంచి రూ.40వేల వరకు కర్ణాటక రాష్ట్రానికి తరలించి సొమ్ముచేసుకుంటారని పేర్కొన్నారు. ఆదివారం అర్ధరాత్రి టాస్క్‌ఫోర్స్ అధికారులు తనిఖీలు చేపట్టి 12 టిప్పర్ల ఇసుక డంపులను గుర్తించి సీజ్ చేసినట్లు తాసీల్దార్ తెలిపారు.

SHRIRAM Finance వాహనములు అమ్మబడును

S.No.	VEHICLE NO.	DISCRIPTION	MODEL
1	AP22AH-8883	SWIFT DZIRE VDI DIESEL 5 SEATER	2012

పై వాహనము తేదీ : 22-04-2025 నాడు వేలం వేయబడును
అడ్రస్: శ్రీరామ్ ఆటో మాల్ యార్డ్, భూత్పూర్, మహబూబ్‌నగర్
శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్
H.No.1-5-41, 2nd Floor, Opp: Susrutha Peoples Hospital, Newtown, Mahabubnagar- 509001. Telangana. Cell: 9908136553

బహిరంగ ప్రకటన
తేది:21-04-2025
ఇందుమూలముగా సమస్త ప్రజలకు నా క్లయింటు శ్రీ యం.ఎ. తాలిఫ్ అన్వర్ తండ్రి యం.ఎ.నజీర్, నివాసము జడ్చర్ల గ్రామము మరియు మండలము, మహబూబ్‌నగర్ జిల్లా గారి తరపున జారీ చేయు బహిరంగ ప్రకటన యేమనగా మహబూబ్‌నగర్ జిల్లా, జడ్చర్ల మండలము, బాదేపల్లి గ్రామము, నాగర్‌కర్నూల్ రోడ్డు యందలి బ్లాక్ నెం.14, విస్తీర్ణము 100 చదరపు గజములు కలిగిన ప్లాటుపై నిర్మించిన ఇంటి నెం.14-64 గల దానిని గృహ యజమాని అయిన శ్రీ గుత్తుల గణేష్ కుమార్ తండ్రి జి. రామ సూర్యనారాయణ నివాసము ఇంటి నెం. 1-4-148, పెద్ద అక్కిరెడ్డిపాలెం, గాజువాక, పెదగంట్యాల, విశాఖపట్నం గారి దగ్గర నా క్లయింటు కొనుటకు నిర్ణయించుకొని గృహ యజమానికి బయానా చెల్లించి గృహ విక్రయ అగ్రిమెంటు పొందియుండిరి. కావున పై కనబరచిన గృహము విషయములో ఎవరికైనను ఎటువంటి అధికారములు, హక్కులు, ఆక్షేపణలు ఉన్న యెడల వాటికి సంబంధించిన పత్రాలతో యుక్తముగా ఈ ప్రకటన వెలువడిన నాటి నుండి (7) రోజులలోపు తమ ఆక్షేపణలను క్రింద కనబరచిన చిరునామాకు తెలియజేయవలెను. నిర్ణయించిన కాలవ్యవధి తర్వాత వచ్చే ఆక్షేపణలను పరిగణనలోనికి తీసుకొనబడవు. అందుకు వారే బాధ్యత వహించవలసి యుండును. ఆక్షేపణలు కాలవ్యవధిలో రాని యెడల ఇట్టి గృహముపై ఎటువంటి ఆక్షేపణలు లేనట్లుగా భావించి కాలవ్యవధి అయిన వెంటనే నా క్లయింటు పై చూయించిన గృహమును తన పేర రిజిస్ట్రేషన్ చేసుకొనగలడు.
హద్దులు:- తూర్పు: సిగ్నల్ గడ్డ నుండి నాగర్ కర్నూల్ వెళ్ళు రోడ్డు, పడమర: ఇతరుల గృహము,
ఉత్తరం: నైబర్స్ గృహము, దక్షిణము: వడ్ల నారాయణ గృహము.
GOPAL JHAWAR, Advocate, # 30-141, Venkateshwara Colony, Jadcherla-509301, Mahabubnagar Dist. Cell : 9291211196

అరగంటలోనే అతలాకుతలం

- కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యం
- తడిసిన ధాన్యాన్ని కొనాలని రైతుల డిమాండ్
- టోకెన్లు, గన్నీ బ్యాగులు ఇవ్వకే నష్టపోయామంటున్న అన్నదాతలు

మహ్మదాబాద్, ఏప్రిల్ 21: ఆరునెలల కష్టం అరగంటలో వర్షార్పణమైంది. ఆరుగాలం కష్టపడి పండించిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చి అమ్ముదామనుకునే రైతుకు అకాల వర్షం శాపంగా మారింది. రైతులకు కన్నీటి కష్టాలే మిగిలాయి. మండలంలోని వెంకటాపల్లి, మహ్మదాబాద్ కొనుగోలు కేంద్రాల్లో సోమవారం కురిసిన భారీ వడగండ్ల వర్షంతో వరి ధాన్యం తడిసి ముద్దయింది. ధాన్యం తడవకుండా కాపాడుకునేందుకు రైతులు కుప్పలుగా చేసి తార్పాలిన్ కవర్లు కప్పేందుకు తీవ్రంగా ప్రయత్నించినా ఫలితం దక్కలేదు. దీంతో కొనుగోలు కేంద్రాలు తడిసిన ధాన్యంతో నిండి పోయాయి. 18తేమ శాతం ఉన్న కూడా రైతులకు ఏఈవో టోకెన్లు, గన్నీ బ్యాగులు ఇవ్వకపోవడంతో చాలామంది రైతులు తీవ్రంగా నష్టపోయారు. కొనడానికి సిద్ధంగా ఉన్న బస్తాలు ఇవ్వకపోవడం తూకం వేయకపోవడమే కారణమని కొంతమంది రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తడిసిన ధాన్యాన్ని ఏం చేయాలోనని దిక్కుతోచని స్థితిలో రైతులు మదనపడుతున్నారు. కొనడడానికి ఆలస్యం చేసినందున తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. కోతకు సిద్ధంగా పంట పొలాల్లో వడగండ్ల వానకు పంట నేలరాలింది.

వర్షానికి తడిసిన వరి ధాన్యం

నారాయణపేటరూరల్, ఏప్రిల్ 21: పేట మండలంలోని సింగారం, జాజాపూర్, శేర్నపల్లి, భైరం కొండతో తదితర గ్రామాల్లో సోమవారం సాయంత్రం భారీ ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. దీంతో అక్కడక్కడ రైతులు తమ పొలాల వద్ద వడ్లను ఎండకు ఆరబెట్టగా అవి వర్షానికి తడిసి ముద్దాయ్యాయి. దీంతో రైతులు చేతి కొచ్చిన పంట తడిసి పోవడంతో రైతులు తీవ్ర ఆవేదనకు లోనవుతున్నారు.

వర్షానికి తడిసిన ధాన్యం

జాజాపూర్‌లో వర్షానికి తడిసిన ధాన్యంలో నుంచి నీళ్లను తోడేస్తున్న రైతు

సమస్యల పరిష్కారానికి కృషిచేయాలి

• సీఎం కార్యదర్శి మాణికరాజ్

నారాయణపేట, ఏప్రిల్ 21: ప్రజాసమస్యల పరిష్కారానికి అధికారులు చిత్తశుద్ధితో కృషి చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి కార్యదర్శి మాణికరాజ్ సూచించారు. సోమవారం నారాయణపేట పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి కార్యదర్శికి కలెక్టరేట్‌లో కలెక్టర్ సిక్తా పట్నాయక్, అదనపు కలెక్టర్లు సంచిత్ గంగ్వార్, బేన్ షాలం పుష్ప గుచ్చాలిచ్చి స్వాగతం పలికారు. అనంతరం కలెక్టర్ చాంబర్‌లో భూభారతి పోర్టల్, తాగునీటి సమస్యపై సమీక్షించారు.

వర్షపు నీటిని సంరక్షించాలి

హన్వాడ, ఏప్రిల్ 21: కురిసిన వర్షాలకు నీరు వృథా కాకుండా వాటిని సంరక్షించాలని డీఆర్డీవో నర్సింహులు అన్నారు. సోమవారం మండలంలోని మునిమోక్షంలో వాటర్‌షెడ్ యాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా వాటర్‌షెడ్ కార్యక్రమంలో భాగంగా ప్రతి గ్రామానికి కళా బృందం వెళ్లి ప్రజలకు మాటపాటలతో నీటి సంరక్షణపై అవగాహన కల్పిస్తారన్నారు.కార్యక్రమంలో తాసీల్దార్ కిష్ట్యానాయక్, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు మహేందర్, చెన్నయ్య, రాములమ్మ, వెంకటయ్య, నవనీత తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచాలి

ధన్వాడ, ఏప్రిల్ 21: దవాఖాన పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని డీఎంహెచ్‌వో సౌభాగ్యలక్ష్మి సూచించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానను సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఓపీ, ఉద్యోగుల హాజరు రిజిస్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దవాఖానలో కాన్పుల సంఖ్యను పెంచి మాతా శిశు మరణాలను తగ్గించాలని ఆదేశించారు. అదేవిధంగా జిల్లాలో ఎండల తీవ్రత ఎక్కువగా ఉందని వడదెబ్బ తగల కుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు అనూష, సింధూజ, స్టాఫ్ నర్స్ సునీత, ఎంపీహెచ్‌వో కథలప్ప తదితరులు పాల్గొన్నారు.

బకాయిలు చెల్లించాలి

మహబూబ్‌నగర్ అర్బన్, ఏప్రిల్ 21: ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల బకాయిలు చెల్లించాకే నూతన ఉద్యోగల నియమకాలు చేపట్టాలని ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయిస్ ఫోరం అధ్యక్షుడు రాజసింహుడు అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ ఫోరం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. త్వరలోనే టీజీఎస్ఆర్టీసీలో కొత్తగా పోస్టులు భర్తీ చేస్తామని రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటనను స్వాగతిస్తున్నప్పటికీ.. విశ్రాంత ఉద్యోగుల బకాయిలు పీఆర్సీ ఏరియర్స్ వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాగ ఆంజనేయులు, లలితమ్మ, నర్సింహులు, మనోహర్, బుచ్చన్న, రియాజొద్దీన్ పాల్గొన్నారు.

అక్షరాస్యతతోనే అభివృద్ధి

భూత్పూర్, ఏప్రిల్ 21: అక్షరాస్యతతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని సిర్డ్ సంస్థ జిల్లా కార్యదర్శి కురుమూర్తి అన్నారు. సోమవారం మండలంలోని పోతులమడుగులో ఆర్‌బీఐ ఆధ్వర్యంలో మహిళా సంఘాలకు బ్యాంక్‌ల పనితీరుపై అవగాహన కల్పించారు. మహిళలు చదువుకుంటే అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. సామాజిక రుగ్మతను రూపుమాపాలంటే ప్రతి ఒక్కరూ చదువుకోవాలని సూచించారు. చదువుకున్న వ్యక్తి మోసపోయే ఆస్కారం ఉండదన్నారు. ఈ విషయాలపై కళాజాత బృందం ఆటపాటలతో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్ రాధిక, కోఆర్డినేటర్స్ అరుణ్‌కుమార్, మహేశ్వరి, కళాజాత బృందం నారాయణ, రాంబాబు గ్రాస్తులు తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ సరవణ బిల్లు ఉపసంహరించాలి

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 21: వక్ఫ్ సరరణ బిల్లు చట్టాన్ని ఉపసంహరించే వరకు కేంద్రంపై తమ పోరాటం కొనసాగుతుందని ముస్లిం సంఘాల ప్రతినిధులు మౌలానా నయీం కౌసర్ రషీద్, మౌలానా ఫక్రుద్దీన్ రషాదీ, మౌలానా ఆజహరుద్దీన్ ముకర్రం, మౌలానా అబ్దుల్ హకీం, డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ హెచ్చరించారు. జిల్లా కేంద్రంలో సోమవారం వారు విలేకరులతో మాట్లాడారు. కేంద్రం తీసుకొచ్చిన వక్ఫ్‌బోర్డు సరవణ చట్టాన్ని వ్యతిరేకిస్తూ ఆలిండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా పలు చోట్ల బహిరంగ సభలు నిర్వహించడానికి నిర్ణయించినట్లు, అందులో భాగంగా ఈనెల 26న రాత్రి 7గంటలకు జిల్లా కేంద్రంలోని బాలుర జూనియర్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేయనున్నట్లు సభ కన్వీనర్ మౌలానా నయీం కౌసర్ రషాదీ వెల్లడించారు.

డీఎంహెచ్‌వోగా జయచంద్రమోహన్

నారాయణపేట, ఏప్రిల్ 21: నారాయణపేట డీఎంహెచ్‌వోగా జయచంద్రమోహన్‌ను నియమిస్తూ హెల్త్ సెక్రటరీ క్రిస్టినాచొంగ్తూ సోమవారం ఉత్తర్వులు విడుదల చేశారు. ప్రస్తుత డీఎంహెచ్‌వో సౌభాగ్యలక్ష్మిని డీపీహెచ్‌లో రిపోర్ట్ చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

నవాబ్‌పేట, ఏప్రిల్ 21: మండలంలోని ఇప్పటూర్, కొల్లూరు, చౌడూర్, గురుకుంటలో సోమవారం సింగిల్‌విండో, ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సింగిల్‌విండో చైర్మన్ మాడెమోని నర్సింహులు, మార్కెట్ చైర్మన్ హరలింగం ప్రారంభించారు. ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి కేంద్రాలను ప్రారంభించారు. రైతులు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో మైసమ్మ ఆలయ కమిటీ చైర్మన్ జగన్‌మోహన్‌రెడ్డి, సింగిల్‌విండో వైస్ చైర్మన్ భూపాల్‌రెడ్డి, మార్కెట్ వైస్ చైర్మన్ తులసీరామ్‌నాయక్, మాజీ ఎంపీపీలు అనంతయ్య, శీనయ్య, సింగిల్‌విండో డైరెక్టర్ ప్రతాప్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మహనీయుల అడుగుజాడల్లో సాగాలి

• ఓయూ ప్రధానాచార్యులు కాశీం

మాట్లాడుతున్న ఓయూ ప్రొఫెసర్ ఆచార్య కాశీం

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, ఏప్రిల్ 21: మహనీయుల అడుగుజాడల్లో ముందుకు సాగాలని ఓయూ ప్రధానాచార్యులు కాశీం అన్నారు. సోమవారం పీయూ లైబ్రరీ ఆడిటోరియంలో ఎస్సీ, ఎస్టీ, బీసీసెల్ ఆధ్వర్యంలో మహనీయుల జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంబేద్కర్ అంటే ఒక పోరాటం.. ఒక సిద్ధాంతం.. ఒక ఆవేశం అన్నారు. భారత రాజ్యాంగం అమలుకు ప్రతిఒక్కరూ కృషిచేయాలన్నారు. రాజ్యాంగం రిజర్వేషన్ ఫలాలు పొందుతున్న ప్రతిఒక్కరూ అంబేద్కర్ ఆశయ సాధనకు పని చేయాలన్నారు. మహనీయుల ఆశయాలను కొనసాగించడం మన బాధ్యతని, ఆత్మవిశ్వాసం, ధృడసంకల్పం కలిగి ఉండాలన్నారు. మహనీయుల జీవిత చరిత్రలను అధ్యయనం చేయాలని పీయూ వీసీ శ్రీనివాస్ సూచించారు. కార్యక్రమంలో ఎస్పీ జానకి, పీయూ రిజిస్ట్రార్ రమేశ్‌బాబు, ఎస్సీ, ఎస్టీసెల్ డైరెక్టర్ కుమారస్వామి, బీసీ సెల్ డైరెక్టర్ ప్రవీణ తదితరులు పాల్గొన్నారు.

మూడోరోజు విధులు బహిష్కరించి ఒప్పంద ఉద్యోగుల నిరసన

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, ఏప్రిల్ 21: కాంగ్రెస్ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు అన్ని అర్హతలున్న యూనివర్సిటీ అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలని కోరుతున్నామని ఒప్పంద అధ్యాపకుల సంఘం నాయకులు జ్ఞానేశ్వర్ డిమాండ్ చేశారు. సోమవారం పాలమూరు యూనివర్సిటీ ఎదుట ఒప్పంద అధ్యాపకులు మూడో రోజు సమ్మెలో భాగంగా విధులు బహిష్కరించి ఆందోళన చేపట్టారు. న్యాయమైన డిమాండ్ల సాధనలో భాగంగా శాంతియుత నిరసనలు, ఆందోళనలకు అడ్డుపడితే ఉద్యమం మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. జీవో 21 వెంటనే రద్దు చేయాలన్నారు. నెట్టు, సెట్టు, పీహెచ్‌డీ అర్హత ఉన్న ఒప్పంద అధ్యాపకులందరినీ బేషరతుగా క్రమబద్ధీకరించాలన్నారు. లేదంటే యూజీపీ పే స్కేల్‌తో కూడిన ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. కార్యక్రమాల్లో భూమయ్య, శ్రీధర్‌రెడ్డి, అర్జున్‌కుమార్, సుదర్శన్‌రెడ్డి, గౌస్, ప్రదీప్, ప్రభాకర్‌రెడ్డి, ఈశ్వర్‌కుమార్, సోమేశ్వర్, విజయభాస్కర్, రవికుమార్, కరుణాకర్‌రెడ్డి, రవికాంత్, పర్వతాలు, స్వాతి, అరుంధతి, సబిత, బృందా, నాగరాజు, సురేశ్, వేణు తదితరులు పాల్గొన్నారు.

నిరసన వ్యక్తం చేస్తున్న పీయూ ఒప్పంద అధ్యాపకులు

దేవరగుట్టలో చిరుత సంచారం

నవాబ్‌పేట, ఏప్రిల్ 21: మండలంలోని దేవరగుట్టలో పదిరోజుల నుంచి మకాం వేసి సంచరిస్తున్న చిరుతతోపాటు దాని (పిల్లలు) కూనలు ఉన్నట్లు గ్రామానికి చెందిన ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. ఎవరూ లేని సమయంలో చిరుతతోపాటు దాని పిల్లలు గుట్ట గుహల్లో నుంచి బయటకు వచ్చి సేద తీరుతున్నట్లు వివరించారు. పది రోజుల నుంచి వందలాది మంది ప్రజలు గుట్ట వద్దకు వెళ్లి హడావిడి చేసినా.. చిరుత గుట్టను వీడి వెళ్లడం లేదంటే.. అక్కడ చిరుత కూనలు(పిల్లలు) ఉన్నందుకే వెళ్లడం లేదని తెలుస్తోంది. కాగా గుట్టపై మూడు రోజుల కిందట చిరుతను పట్టుకునేందుకు అటవీశాఖ అధికారులు బోన్ ఏర్పాటు చేసినా.. బోన్‌లో చిక్కకుండా చాకచక్యంగా తప్పించుకుని తిరుగుతోంది. సోమవారం సాయంత్ర దేవర గుట్టపై ఎత్తైన గుండ్లపైకి ఎక్కిన చిరుత చూపరులకు దర్శన మిచ్చింది. అటవీ అధికారులు చేస్తున్న ప్రయత్నాలు ఫలించకపోవడంతో తలలు పట్టుకుంటున్నారు.

నిందితుడికి రిమాండ్

మద్దూర్, ఏప్రిల్ 21: బాలికపై లైంగిక దాడిచేసిన కేసులో నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ సైదులు తెలిపారు. సీఐ కథనం ప్రకారం.. దామరగిద్ద మండలంలోని క్యాతన్‌పల్లికి చెందిన బోయిని శ్రీనివాస్(24) ప్రేమపేరుతో పదిహేడేళ్ల బాలికను మోసగించి బలాత్కారం చేశాడు. ఈనెల 10న బాధితురాలు కంప్యూటర్ క్లాస్‌కు మద్దూర్‌కు రాగా నిందితుడు మోటర్ సైకిల్‌పై హైదరాబాద్ తీసుకెళ్లి అక్కడే అద్దెరూమ్‌లో ఉండి మరుసటిరోజు బాధితురాలిని మద్దూర్ బస్టాండ్‌లో వదిలివెళ్లాడు. బాధితురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టగా.. పరారీలో ఉన్న నిందితుడిని సోమవారం కోస్గి న్యాయస్థానం ఎదుట ప్రవేశపెట్ట మెజిస్ట్రేట్ 14రోజులు రిమాండ్ విధించగా మహబూబ్‌నగర్ సబ్‌జైలుకు తరలించినట్లు తెలిపారు.

జిల్లాస్థాయి క్విజ్‌లో ప్రతిభ

జడ్చర్ల టౌన్, ఏప్రిల్ 21: మండలంలోని పెద్దఆదిరాల జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని ఆరాధ్య జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి ద్వితీయ బహుమతి సాధించినట్లు హెచ్ఎం మల్లయ్య తెలిపారు. రాష్ట్రీయ ఆవిష్కార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మ్యాథ్స్, సైన్స్ విభాగంలో జరిగిన జిల్లాస్థాయి క్విజ్ పోటీల్లో ఆరాధ్య ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లాస్థాయిలో ప్రతిభ కనబరిచి బహుమతిని అందుకున్న ఆరాధ్యను ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

కొల్లూరు విద్యార్థుల ప్రతిభ

నవాబ్‌పేట, ఏప్రిల్ 21: మండలంలోని కొల్లూరు ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు జిల్లా స్థాయి క్విజ్ పోటీల్లో తమ ప్రతిభ కనబర్చి ప్రథమ బహుమతి అందుకున్నారు. జిల్లా కేంద్రంలో సోమవారం విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన గణితం, క్విజ్ పోటీల్లో కొల్లూరు ఉన్నత పాఠశాల విద్యార్థులు తమ ప్రతిభతో రెండు జిల్లా స్థాయి బహుమతులు అందుకున్నట్లు జీహెచ్ఎం శ్రీకాంత్ తెలిపారు. 8వ తరగతి విభాగంలో విద్యార్థిని లిఖిత ప్రథమ బహుమతి, 7వ తరగతి విభాగంలో శృతి జిల్లా స్థాయిలో ప్రథమ బహుమతి గెలు పొందినట్లు వివరించారు. గెలుపొందిన వారికి ఏఎంవో దుంకుడు శ్రీనివాస్ బహుమతులు అందజేసి ప్రత్యేకంగా అభినందించారు.

చర్యలు తీసుకోవాలి

ఊట్కూర్, ఏప్రిల్ 21 : మండలంలోని ఓబులాపూర్ గ్రామంలో రోడ్డును ఆక్రమించి కాంపౌండ్ నిర్మాణం చేపడుతున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మాజీ సర్పంచ్ భీమ్‌రెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు లక్ష్మిరెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం గ్రామస్తులతో కలిసి కలెక్టర్ కార్యాలయం, పంచాయతీరాజ్ శాఖ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం 217 సర్వే నెంబర్ వ్యవసాయ పొలాన్ని కొనుగోలు చేసి గతంలో పేదలకు పట్టాల పంపిణీ చేపట్టగా మిగిలిన మరి కొంత స్థలాన్ని యజమాని ప్రైవేట్ వ్యక్తులకు అమ్ముకోవడంతో బలహీన వర్గాల ప్రజలు ఇండ్ల నిర్మాణం చేపట్టడంతో బీసీ కాలనీ ఏర్పడిందన్నారు. కాగా ఇదే కాలనీలో యజమాని సుధాపరిమళదేవి రోడ్డును ఆక్రమించి అక్రమంగా కాంపౌండ్ నిర్మాణ పనులు చేపట్టినట్లు అధికారులకు ఫిర్యాదు చేశారు.

వరంగల్ సభకు సైనికుల్లా తరలిరావాలి

కోస్గి, ఏప్రిల్ 21: వరంగల్ జిల్లా ఎల్కతుర్తి వద్ద జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభకు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు సైనికుల్లా తరలిరావాలని జిల్లా గ్రంథాలయాల సంస్థ మాజీ చైర్మన్ శాసం రామకృష్ణ పిలుపునిచ్చారు. సోమవారం ఆయన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి రజతోత్సవ సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రత్యేక తెలంగాణ కోసం పుట్టిన ఉద్యమ పార్టీ అని.. ఏ కారణంతో పార్టీ ఆవిర్భవించిందో అదే కలను సాకారం చేసిన నాయకుడు కేసీఆర్ అని పేర్కొన్నారు. ఈనెల 27న మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో కోస్గి మండల కేంద్రంతోపాటు ప్రతి గ్రామం నుంచి పెద్దఎత్తున తరలివచ్చి సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సాయిలు, జనార్దన్‌రెడ్డి, మోహన్ గౌడ్, హన్మంతు, రుద్రప్ప, పోషప్ప, నిరంజన్‌రెడ్డి, మహేశ్‌గౌడ్, బాలయ్య, చెన్నప్ప, రుక్మప్ప, అంజిలయ్య, చంద్రయ్య పాల్గొన్నారు.

చలో వరంగల్‌ను జయప్రదం చేయాలి

మాగనూర్, ఏప్రిల్ 21 : వరంగల్ జిల్లా ఎల్కుర్తిలో నిర్వహించే భారీ బహిరంగ రజతోత్సవ సభకు మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో తరలిరావాలని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు ఎల్లారెడ్డి సోమవారం తెలిపారు. మక్తల్ నియోజకవర్గం నుంచి 30 బస్సులు, దాదాపు 100 వాహనాలు వరంగల్ సభకు తరలివెళ్లనున్నాయని ఆయన పేర్కొన్నారు. 27వ తేదీన ఉదయం 6 గంటలకు అన్ని గ్రామాల్లో బీఆర్ఎస్ పార్టీ జెండావిష్కరణ చేపట్టి, తమకు కేటాయించిన బస్సుల్లో, వాహనాల్లో వరంగల్ సభకు తరలి రావాలని సూచించారు.

వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

విధుల్లో చేర్చుకోవాలి

ఎమ్మెల్యే శ్రీహరికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మక్తల్, ఏప్రిల్ 21 : ఎస్సీ గురుకుల బాలికల పాఠశాల కళాశాలలో విధులు నిర్వహిస్తున్నటువంటి పార్ట్ టైం ఉద్యోగులను విధుల్లో చేర్చుకునే విధంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ మక్తల్ ఎమ్మెల్యే శ్రీహరికి సోమవారం పార్ట్ టైం ఉద్యోగులు వినతిపత్రం అందజేసినట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఈశ్వర్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ పదేండ్లుగా ఎస్సీ గురుకుల పాఠశాల కళాశాలలో పార్ట్ టైం ఉద్యోగులుగా విధులు నిర్వహిస్తున్నామన్నారు. ఎలాంటి కారణం లేకుండా అమ్మాయిల స్కూలు నుంచి తొలగిస్తూ ఎస్సీ గురుకుల పాఠశాల, కళాశాలల సెక్రటరీ వర్షిని ఉత్తర్వులు జారీ చేశారని పేర్కొన్నారు. పార్ట్ టైం ఉద్యోగులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్ట్ టైం ఉద్యోగులు ఉన్నారు.

ప్రజా ఫిర్యాదులకు సత్వర పరిష్కారం

• అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, ఏప్రిల్ 21: ప్రజా ఫిర్యాదులకు సత్వర పరిష్కారం చూపాలని అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్ సూచించారు. సోమవారం ప్రజా ఫిర్యాదుల స్వీకరణ, పరిష్కార దినం సందర్భంగా కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో ఆయన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ పరిష్కరించాలని ఆదేశించారు. అంతకుముందు జిల్లాలోని వివిధ గ్రామాలు, మండలాల నుంచి వచ్చిన ప్రజలు మొత్తం 92 ఫిర్యాదులు అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈవో వెంకటరెడ్డి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఫుడ్ సేఫ్టీ అధికారి ఆకస్మిక తనిఖీ

పాల నాణ్యతను పరిశీలిస్తున్న జిల్లా అధికారి మనోజ్

జడ్చర్ల టౌన్, ఏప్రిల్ 21: పట్టణంలోని ఫాస్‌ఫుడ్ సెంటర్లు, మిల్క్‌డైరీ యూనిట్లలో జిల్లా ఫుడ్‌సేఫ్టీ అధికారి మనోజ్ సోమవారం ఆకస్మిక దాడులు చేశారు. ఇటీవల పట్టణంలోని తాజ్ ఫుడ్‌కోర్టులో బిర్యానీ, చికెన్‌లో బొద్దింకలు రావడాన్ని వినియోగదారులు గుర్తించి సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు జిల్లా ఫుడ్‌సేఫ్టీ అధికారి సోమవారం పట్టణంలోని తాజ్‌ఫుడ్ కోర్టులో చికెన్ బిర్యానీ నాణ్యతోపాటు వంటగదిలో శుభ్రత ప్రమాణాలను పరిశీలించారు. అదేవిధంగా పట్టణంలోని పలు పాల డెయిరీలను తనిఖీ చేసి పాల నాణ్యతను పరిశీలించారు. చికెన్, పాలను నాణ్యత ప్రమాణాల కోసం శాంపిల్స్ సేకరించి ల్యాబ్‌కు పంపిస్తున్నట్లు తెలిపారు. ల్యాబ్ రిపోర్డ్ ఆధారంగా కల్తీ నిర్ధారణ జరిగితే సంబంధిత యజమానులపై క్రిమినల్ కేసులు నమోదు చేయనున్నట్లు చెప్పారు.

జామియా మసీద్ లెక్కలు తేల్చాలి

దేవరకద్ర, ఏప్రిల్ 21: మండల కేంద్రంలోని జామియా మసీదుకు చెందిన దుకాణా సముదాయాల లెక్కలు తేల్చాలని పట్టణ ముస్లింలు ఎంఏ ఖదర్ పాషా, మునీరొద్దీన్, ఇక్బాల్, మైనొద్దీన్ తదితరులు డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని శ్రీనివాస గార్డెన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. పదేండ్ల నుంచి జామియా మసీద్ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు సయ్యద్ అంజాద్ అలి, సయ్యద్ ఫారూఖ్ అలీ మండల కేంద్రంలోని కొత్తబస్టాండ్ వద్ద మసీదు సంబంధించిన 11 దుకాణాలకు ప్రతినెలా అద్దెలు వసూలు చేసుకొని సొంత అవసరాలకు వాడుకున్నారని.. లెక్కలు చూపాలని కోరితే వాగ్వాదానికి దిగుతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో ఎండీ సలీం, హస్నొద్దీన్, ఎండీ సిరాజ్, ఖాజామైనొద్దీన్, ఖాదర్, షన్ను, ముక్తార్ తదితరులు ఉన్నారు.

కరాటే శిక్షణ పోస్టర్ ఆవిష్కరణ

మహబూబ్‌నగర్ అర్బన్, ఏప్రిల్ 21: జిల్లా కేంద్రంలోని శ్రీహనుమాన్ కరాటే, యోగ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 30నుంచి జూన్ 11వ తేదీవరకు మోడల్ బేసిక్ స్కూల్‌లో నిర్వహించే వేసవి ఉచిత కరాటే శిక్షణ పోస్టర్‌ను సోమవారం ఒలింపిక్ సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్, శ్రీ హనుమాన్ కరాటే వ్యవస్థాపక అధ్యక్షుడు వెంకటేశ్ ఆవిష్కరించారు. ఉచిత శిక్షణను ప్రతి ఒక్కరూ ఉపయోగించుకోవాలని.. ఆత్మరక్షణకు కరాటే ఎంతో ఉపయోగపడుతుందని సూచించారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివించాలి

కృష్ణ, ఏప్రిల్ 21 : మండలంలోని కున్సి గ్రామంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శివరాజ్ ఆధ్వర్యంలో సోమవారం బడిబాట కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలలో అన్ని సౌకర్యాలు ఉన్నాయని, విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని తల్లిదండ్రులకు వివరించారు. ప్రభుత్వ పాఠశాల బలోపేతానికి గ్రామస్తులందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అనిత, అశోక్, ప్రియాంక, అంగన్‌వాడీ టీచర్ మంజుల, విద్యార్థులు ఉన్నారు.